ప్రజాశక్తి
గురువారం 05 అక్టోబర్ 2023
5
కర్నూలు

ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

పార్లమెంట్ బరిలో వాల్మీకి నేతలు...

- మారుతున్న రాజకీయ సమీకరణాలు - వైసిపి నుంచి రామయ్య, టిడిపి నుంచి బిటి.నాయుడు..?

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి దూకుడు పెంచాయి. అందులో భాగంగానే కర్నూలు పార్లమెంట్ బరిలో తమ అభ్యర్థులను దించేందుకు రంగం సిద్ధం చేశాయి. ఈ పార్లమెంట్ పరిధిలో బీసీ ఓటర్లు అధికంగా ఉండడంతో వైసిపి రెడ్డి సామాజిక వర్గానికి కాకుండా వాల్మీకి వర్గానికి చెందిన నగర మేయర్ బివై.రామయ్యను బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. ఈయన వైసిపి జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. ఈయనను ధీటుగా ఎదుర్కొనేందుకు గానూ టిడిపి అధినేత అదే సామాజిక వర్గానికి చెందిన, టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఉన్న బిటి.నాయుడును బరిలో దించేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. సీట్ల కేటాయింపుపై ఆయా పార్టీల నేతల నుంచి ఇంకా స్పష్టత రాలేదు....

కర్నూలు పార్లమెంట్ పరిధిలో సీట్ల చర్చ మొదలైంది. బీసీ ఓటర్లు అధికంగా ఉన్న ఈ పార్లమెంట్ బరిలో ఈసారి రెడ్డి సామాజిక వర్గాన్ని కాదని బీసీలకు సీట్లు కట్టబెట్టాలని అధికార, ప్రతిపక్ష పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. కర్నూలుపై మంగళగిరి ప్రభావం పడింది. 2019 పాదయాత్ర సమయంలో జగన్ చేనేత వర్గానికి ఒక టికెట్ ఇస్తానని హామీచ్చారు. అందులో భాగంగా చివర్లో కర్నూలు ఎంపీ, మంగళగిరి ఎమ్మెల్యే స్థానాలు మిగలగా మంగళగిరిలో నారా లోకేష్‌ను ఢీకొట్టడం ఆళ్ల రామకృష్ణారెడ్డికే సాధ్యమని సర్వేలో తేలడంతో ఆ ప్రభావం కర్నూలు పార్లమెంటు స్థానంపై పడింది. ఆ స్థానంపై ఆశలు పెట్టుకున్న వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రామయ్యను పక్కన పెట్టిన జగన్ ఇప్పుడు ఆయనకు టికెట్ ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైసిపి జిల్లా అధ్యక్షులుగా ఉన్న బివై.రామయ్య నగర మేయర్‌గా ఉన్నారు. అలాగే బిటి.నాయుడు కూడా టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఉండడం విశేషాన్ని సంతరించుకుంది. రాజకీయ చాణక్యుడుగా పేరున్న బివై.రామయ్య నగర మేయర్‌గా ఉంటూ నగరాన్ని అభివృద్ధి చేసి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. అలాగే జిల్లా రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇక టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు టిడిపి తరఫున 2014లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. టిడిపి అధికారంలో ఉండడంతో బిటికి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీ, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ పదవులను కట్టబెట్టారు. 2019లో కోట్ల టిడిపిలో చేరడంతో బిటి.నాయుడును పక్కన పెట్టిన చంద్రబాబు కోట్లకు టికెట్ ఇవ్వడం, ఆయన ఓడిపోవడం చకచకా జరిగిపోయాయి. తాజాగా రాజకీయ సమీకరణాలు మారడం, వైసిపి బీసీ అస్త్రాన్ని బలంగా వాడుకోవడంతో అధికంగా ఉన్నా కర్నూలు పార్లమెంటుపై చంద్రబాబు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఈ సారి వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బిటి.నాయుడును బరిలో దింపేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు బిజెపి నుంచి పోటీ చేసేది కూడా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారే కానున్నారు. పార్థ డెంటల్స్ అధినేత పార్థసారథి గత ఎన్నికల్లో బిజెపి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. మళ్లీ బరిలో ఆయనే నిలుస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. కర్నూలు పార్లమెంట్ పరిధిలో కొండారెడ్డి బురుజుపై త్రిముఖ పోటీ నెలకొంది. సీట్ల విషయంపై ఆయా పార్టీల అధినేతల నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు.

రూ.4.41 కోట్లతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన - వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆదోని మండలం చిన్న పెండేకల్ గ్రామం వద్ద రూ.4.41 కోట్లతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో 13 సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ఆదోని మండలం చిన్న పెండేకల్ గ్రామం వద్ద రూ.4.41 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలు పండించే రైతులకు సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో జొన్నలు, కొర్రలు, సజ్జలను ఎక్కువగా పండిస్తున్నారన్నారు. అందువల్ల ఆదోని ప్రాంతంలో చిరు ధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కొర్ర, జొన్న, సజ్జలను పౌడర్ చేసి మిల్లెట్ ఫ్లోర్, బిస్కెట్స్, మిల్లెట్ ఫ్లేక్స్, వర్మి సెల్లి, నూడిల్స్ తదితర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేయడం జరుగుతుందన్నారు. తద్వారా రైతుల ఆదాయాన్ని మరింత పెంచి వారి జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు మిల్లెట్ల వాడకంతో ప్రజల ఆరోగ్యం కూడా బాగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా పరిసర ప్రాంతాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా దేవి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశివలీల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

పత్రిక స్వేచ్ఛను హరిస్తున్న మోడీ

- నల్లజెండాలతో ప్రజా సంఘాల నిరసన

- ఎపిడబ్ల్యుజెఎఫ్ సంఘీభావం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్రికలపై దాడులు చేయడం అంటే ప్రజల గొంతును నొక్కడమే అలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు అమలు చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను అణిచివేస్తుందని ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ప్రజా సంఘాలు, న్యాయ వాదులు ముక్తకంఠంతో నిరసన తెలిపారు. నల్లజెండాలతో చేత పట్టుకుని నిరసన చేపట్టారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ సంఘీభావం తెలిపింది. సిఐటియు నగర నాయకులు టి.రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, ఐలు రాష్ట్ర నాయకులు కేంగార కుమార్, డి.వెంకటస్వామి, అవాజ్ కమిటీ నాయకులు ఎస్‌ఎండి షరీఫ్, ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర మాట్లాడారు. ప్రముఖ జర్నలిస్టులు స్టాండ్-అప్ కమెడియన్‌లు, వ్యంగ్య రచయితలు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక చరిత్రకారులు, వ్యాఖ్యాతల ఇళ్లపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. క్రూరమైన ఊపా చట్టం ద్వారా వివిధ సెక్షన్లు ప్రయోగించి ఎఫ్ఐఆర్ రాయటం చేస్తుందన్నారు. తొమ్మిదేళ్లలో, మోడీ ప్రభుత్వం బిబిసి, న్యూస్ లాండ్రీ, దైనిక్‌భాస్కర్, భారత్ సమాచార్, ది కాశ్మీర్ వాలా , ది వైర్ వంటి వివిధ మీడియా సంస్థలను అణచివేయడానికి, వేధించడానికి , భయపెట్టడానికి దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తుందన్నారు. ఇప్పుడు న్యూస్ క్లిక్ దానితో సంబంధం ఉన్న వారందరిపై దాడులు చేస్తోందన్నారు. నిజాన్ని మాత్రమే ప్రజలకు చేరవేసే మీడియా సంస్థలు, జర్నలిస్టులపై ఇంత పెద్ద ఎత్తున నిరంకుశ దాడి చేయడం ఆమోదయోగ్యం కాని విషయని ఇలాంటి దాడులు చేయడం అంటే ప్రజలపై ప్రజా వ్యవస్థపై రాజ్యాంగంపై దాడి చేయడం ఒక్కటే అన్నారు. ప్రజల తరపున ఉద్యమిస్తున్న మీడియాను లక్ష్యంగా చేసుకుని వారిని హింసించటం, అణిచివేసేందుకు చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య భావాలు కలిగిన ఈ దేశపు పౌరులు, దేశభక్తులందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ దాడులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉండాలని లేని పక్షంలో ప్రజలు ప్రజాస్వామ్య వాదులతో కలిసి మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతారని భయం వల్ల ఇలాంటి దాడులకు తెగబడ్డారన్నారు. సిఐటియు ఉపాధ్యక్షులు రాజశేఖర్, నగర కార్యదర్శి విజయ్, నరసింహులు, గోపాల్, సుధాకరప్ప, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, జిల్లా నాయకులు డి.చంద్ర మోహన్, యూసుఫ్ ఖాన్, వ్యకాస జిల్లా నాయకులు వెంకట్రాముడు, హుసేనయ్య, కెవిపిఎస్ నాయకులు విజయమ్మ, యేసు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు. మద్దతు తెలుపుతున్న జర్నలిస్టులు

ఎస్ఐ మెయిన్స్ తుది పరీక్షలకు గడువు పెంచాలి

- ఎస్ఐ అభ్యర్థులతో ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఎస్ఐ మెయిన్స్ ఎగ్జామ్‌కు రెండు నెలలు పొడిగించాలని జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం ముందు ఎస్ఐ అభ్యర్థులతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా , నిరుద్యోగులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పోరాట ఫలితంగా 6511 పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నోటిఫికేషన్ ఇచ్చిందని, ఎమ్మెల్సీ ఎన్నికల కారణాల రీత్యా ఎక్కువసార్లు ఈవెంట్స్ పరీక్షలు వాయిదా పడడం వలన అభ్యర్థులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. సిలబస్ అత్యధికంగా ఉన్న స్థితిలో అభ్యర్థులకు సన్నద్ధం అయ్యేందుకు సమయం సరిపోవడం లేదన్నారు. గత నోటిఫికేషన్ 2016 , అంతకుముందు రిక్రూట్‌మెంట్ సమయాల్లో ఈవెంట్స్ , మెయిన్స్ మధ్య కనీసం రెండు మూడు నెలలు సమయం ఇచ్చారని, అభ్యర్థులు వాస్తవిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మెయిన్స్ ఎగ్జామ్‌కు రెండు నెలలు గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతి అయితే నిరుద్యోగులకు న్యాయం చేసి రెండు నెలలు గడువు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి , నిరుద్యోగులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న అభ్యర్థులు, నాయకులు

తక్కువ ధరలతో బిఎస్ఎన్ఎల్ సేవలు

- బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి.రమేష్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

త్వరలో అత్యాధునిక స్వదేశీయ టెక్నాలజీతో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు అందిస్తున్నామని 24వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ ఉద్ఘాటించారు. బుధవారం బిఎస్ఎన్ఎల్ భవన్ కార్యాలయంలో బిఎస్ఎన్ఎల్ 24వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుడారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఆయన బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు, ఉద్యోగులకు, భాగస్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. 2000 అక్టోబరు ఒకటిన ప్రభుత్వ రంగ పబ్లిక్ సెక్టార్ యూనిట్‌గా రూపు దిద్దుకున్నప్పటి నుండి ప్రజలకు చేరువగా మారుమూల గ్రామాలకు ల్యాండ్ లైన్ ,బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ ,ఎంటర్‌ప్రైజెస్ సేవలు అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీతో భారత ఫైబర్ ఇంటర్నెట్ సర్వీస్ ద్వారా కరోనా సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన విద్య, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం విధానం ద్వారా విధులను నిర్వహించడానికి ఇంటర్నెట్ సేవలు అందించి ప్రజల మనసులను గెలుచుకుందని తెలిపారు. టెలికాం ఇన్‌ఫ్రాస్టక్చర్ విధానం ద్వారా త్వరితగతిన ఫైబర్ ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. భారత్ ఫైబర్ ఇంటర్నెట్ ద్వారా మారుమూల గ్రామాలకు ఫైబర్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల వారికి కేవలం రూ.399 30 ఎంబిపిఎస్ స్పీడ్‌తో అపరిమితమైన ఇంటర్నెట్ , పట్టణ ప్రాంతాల వారికి రూ.449 అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా ఐపిటివి సర్వీస్‌లను ప్రారంభించామని ఒకే ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ వైఫై టెలిఫోన్, టివి సర్వీసులను అందిస్తున్నామని ఐపిటివి సర్వీసులను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కేవలం రూ.329 ఇంటర్నెట్ సౌకర్యం ఐపిటివి ప్యాకేజీలను కలిపి తగిన ధరలో అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించామన్నారు. స్మార్ట్‌లర్నింగ్ యూజింగ్ బిఎస్ఎన్ఎల్ భారత ఫైబర్ అనే థీమ్ మీద చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 12 పాఠశాలలు, పదకొండు వందలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను బిఎస్ఎన్ఎల్ కర్నూల్ బిజినెస్ ఏరియా మేనేజర్ జి.రమేష్ అందజేశారు. మొదటి బహుమతి సాధించిన శ్రీలక్ష్మీ హైస్కూల్ ఎన్ఆర్‌పేట ఐదవ తరగతి జి.ప్రణీతకు 599 ప్లాన్ ఏడాది పాటు ఉచితంగా బిఎస్ఎన్ఎల్ భారత ఫైబర్ ఇంటర్నెట్ సేవలను అందజేశారు. రెండవ బహుమతి పొందిన సిస్టర్స్ స్టానిలాస్ మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మూడో తరగతి ఎం.సహనకు ఆరు నెలలపాటు ఉచితంగా ఇంటర్నెట్ సేవలను , శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆదోని మూడో తరగతి బహుమతి సాధించిన కె.హన్సికకు మూడవ తరగతి మూడు నెలల పాటు ఉచిత ఫైబర్ ఇంటర్నెట్ సేవలను అందజేశారు. వారికి మెమొంటోలు,సర్టిఫికెట్లను అందజేశారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సాయినాథ్, డిజిఎం, ఐఎఫ్ఎ. శ్రీలత, ఎజిఎం వెంకట్ రాములు, శీను నాయక్, మురళీకృష్ణ, వి.జాన్సన్, నారాయణస్వామి, బిఎస్ఎన్ఎల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

ముదురుతున్న ప్రాణాంతక డెంగీ

ఒకరు మృతి

ఆసుపత్రిలో చేరిన 30 మంది, ఏడుగురు చిన్నారులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం ముడుమాలలో ప్రాణంతక డెంగీ ముదురుతోంది. వైద్యులు, వైద్య సిబ్బంది నామమాత్రపు ఆరోగ్య సేవలు అందించటంతో అదుపులోకి రాక చివరికి మృత్యువాత పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బుధవారం వివాహిత యశోద (25) డెంగీ బారిన పడటంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ తీవ్ర అశ్వస్థతకు గురై కోలుకోలేక మృతిచెందారు. ఆమెకు కుమార్తె (2), భర్త ఉన్నారు. దళిత వాడలో సుమారు 10 మంది, గ్రామం మొత్తానికి 30 మంది పైనే ఆసుపత్రిలో చేరినట్లు గ్రామస్తులు వాపోయారు. ఇందులో చిన్నారులు ఏడుగురు ఉన్నారని, ప్రధానంగా గ్రామంలో స్వచ్ఛ కార్మికులు విధుల్లోకి రావడం లేదని, చెత్త, చెదారం, మురుగు ఎక్కడికక్కడే నిలిచి వ్యాధుల బారిన పడేస్తున్నాయని, పంచాయతీ చర్యలు సూన్యమని పలువురు ఆవేదన చెందారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

సురక్ష క్యాంపులు తప్పనిసరిగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్

జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం నెరవేరేలా క్యాంపులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి ఎక్కడ, ఏ తేదీలో, ఏ టైమ్‌కు నిర్వహిస్తున్నారన్న విషయం ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లినపుడు జగనన్న ఆరోగ్య సురక్ష ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించాలని, టోకెన్లు ఇవ్వడంలో లిమిట్ కూడదని కలెక్టర్ ఆదేశించారు. టైం లోపు క్యాంపులు ప్రారంభించాలని, రోగులందరూ పూర్తి అయిపోయాక తర్వాత మాత్రమే క్యాంపులను ముగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదోని , కర్నూలు ,ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో రోజుకు నాలుగు వార్డులు మాత్రమే జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొనే విధంగా షెడ్యూల్ తయారుచేసుకుని అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్ లు రీ సర్వే అంశానికి సంబంధించిన ప్రతి ప్రక్రియ నిర్దేశిత గడువులోపు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రౌండ్ టూతింగ్ , ఎల్‌పిఎం జనరేషన్, విలేజ్ అసిస్టెంట్ లాగిన్ ,తహశీల్దార్ లాగిన్ తదితర అన్ని ప్రక్రియలు నిర్దేశించిన విధంగా పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య రీ సర్వే పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు.

బజాజ్ ఎన్ 150 ప్రారంభిస్తున్న కరూర్ వైశ్యబ్యాంక్ మేనేజ్ బాలాజీ

మార్కెట్లోకి కొత్త బజాజ్ ఎన్ 150

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు బంగారు పేట నందు గల భారత్ బజాజ్ షోరూం లో సంస్థ ఎండిఎస్.అక్తర్ హుస్సేన్ , కరూర్ వైశ్య బ్యాంక్ మేనేజర్ సి.బాలాజీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన బజాజ్ పల్సర్ ఎన్ 150 ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ 2001లో పల్సర్ లాంచ్ అయిందని, అప్పటినుంచి దినదిన అభివృద్ధి చెందుతూ సాటి లేని బైక్‌గా నిలిచిందని తెలిపారు. ఈరోజు ఎన్150ని తమ షోరూమ్‌లో లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఒక మంచి స్పోర్ట్స్ బైక్అని , మంచి మైలేజ్ తో వస్తుందని తెలిపారు. దీని సిసి 149.68, బరువు 145 కేజీల, డిస్క్ బ్రేకుల, ట్యూబ్ లెస్ టైర్లు, ఎయిర్ కూలెంట్ ఇంజన్, మైలేజ్ 55 కిలోమీటర్లు లీటర్‌కు ఇలా అనేక ఫీచర్స్‌తో అద్భుతమైన బైక్ అని కొనియాడారు.

జర్నలిస్టులపై దాడులు చేస్తే సహించం

పత్తికొండ, కోడుమూరులో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేస్తే సహించమని న్యాయవాదులు, ప్రజా సంఘ నాయకులు హెచ్చరించారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలి దగ్గర సిఐటియు మండల అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ అధ్యక్షతన ఢిల్లీలో జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ న్యాయవాదులు జర్నలిస్టుల నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘ నాయకులు రాముడు, రవి, సురేంద్ర, తాజ్ మహమ్మద్ మాట్లాడారు. యుఎపిఎ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పలువురు జర్నలిస్టులను శాస్త్రవేత్తలను సాంస్కృతిక చరిత్రకారులను ఇళ్లల్లో సోదాలు చేసి వారిని భయభ్రాంతులకు గురి చేయడం దారుణమని అన్నారు. ఢిల్లీలోని న్యూస్ క్లినిక్ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న ఎడిటర్ల పై జర్నలిస్టులపై దాడి చేసి వారి ఇండ్లను సోదాలు చేస్తూ, న్యూస్ క్లిక్ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్త, అమీర్ చక్రవర్తిలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికితీస్తున్న వారిపై కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నియంతృత్వ దోరణితో వ్యవహరిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం అనుబంధ సంఘాలు గౌరీ లంకేష్‌ను హత్య చేశారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న న్యూస్ ఛానళ్లు

పత్తికొండలో నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం నేత గౌస్‌దేశాయి

బిజెపి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను బయటపెడుతున్న ప్రసార ఛానల్ నిలిపివేయడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు. నిలిపి వేసిన ఛానల్‌ను వెంటనే పునరావృతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేయబడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరశేఖర్, మండల కార్యదర్శి రంగారెడ్డి, మండల కమిటీ సభ్యులు దస్తగిరి, వెంకటేశ్వర్ రెడ్డి, సురేంద్ర, గోపాల్, సిద్దయ్య గౌడ్, గంగన్న, నరసన్న, న్యాయవాదులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి :సిపిఎం

కోడుమూరు: సిపిఎం ఆధ్వర్యంలో కోడుమూరు గాంధీ విగ్రహం ముందు నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గఫూర్ మియ్యా మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛపై దాడి ప్రజాస్వామ్యం పై దాడి చేయడం వంటి కుట్రలకు మోడి ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. నాడు జర్మనీలో హిట్లర్ అనుసరించిన పద్ధతిలో నేడు నరేంద్ర మోడీ పాలన అడుగులు వేస్తున్నదన్నారు. మీడియా ప్రతిపక్ష నేతలపై దాడిచేయడం నియంతృత్వ వ్యవహారాలను ఖండించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలలో భాగంగా న్యూస్ క్లిక్ అనే జాతీయ వార్తాపత్రికపై నిన్న జరిగిన దాడిలో న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్తాను ఉపా చట్టం కింద అరెస్టు చేశారన్నారు. సీతారాంఏచూరి, తీస్తాసెతల్వాద్, ఇళ్లతో సహా అనేకమంది జర్నలిస్టుల, కళాకారులకు, చరిత్రకారుల, శాస్త్రవేత్తల, ఇళ్లపై దాడి చేసి అందులోనూ కొందరిని అరెస్టు చేయడం చాలాదారణమన్నారు. సిఐటియు మండల కార్యదర్శి వీరన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, చేనేత సంఘం నాయకులు కుమారస్వామి, పాల శేఖర్, గిడ్డయ్య, శ్రీరాములు, రామ చంద్రుడు, సిఐటియు నాయకులు మధుబాబు, విజయ్ కుమార్, వెంకటగిరి నాయుడు పాల్గొన్నారు.

కోడుమూరులో మాట్లాడుతున్న గఫూర్‌మియా

జిజిహెచ్‌కు రూ. 5 లక్షల వైద్య సామాగ్రి విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రూ.5 లక్షల విలువ చేసే వీల్ చైర్, స్ట్రక్చర్స్, బిపి ఆపరేటర్స్ సెక్షన్ ఆపరేటసర్స్‌ను శ్రీ సద్గురు దత్త కృపాలయం విరాళం అందించారు. ఈ సంధర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల శ్రీసద్గురు దత్త కృపాలయం వారు వీల్ చైర్స్-15 , స్ట్రక్చర్స్-15, బిపి ఆపరేటర్స్-20, సెక్షన్ ఆపరేటర్స్-10 సుమారు రూ.ఐదు లక్షలు విలువ గల సామాగ్రిని విరాళంగా ఆసుపత్రికి ఇచ్చినట్లు తెలిపారు. ఆస్పత్రిలో దాదాపుగా 12 సంవత్సరాల నుండి పేషెంట్స్‌కు క్రమం తప్పకుండా ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం వారు 800 నుండి 1200 మంది పేషెంట్స్‌కు రుచికరమైన భోజనం అందిస్తూ మహోన్నతమైన సేవా కార్యక్రమం చేస్తూ వారు ఇతర సేవా కార్యక్రమాలు కూడా చేస్తూ వైకుంఠ క్షేత్రం నడుపుతూ వారికి కావలసిన ఇండివిడ్యుల్ వెహికల్స్ ద్వారా కర్నూలు పూర ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీసద్గురు దత్త స్వాముల వారికి అడిగిన వెంటనే సానుకూలంగా స్పందిస్తూ వారు వెంటనే ఆసుపత్రికి కావలసిన పరికరాలను అందించడానికి ముందుకు వచ్చి రూ.ఐదు లక్షల విలువ గల పరికరాలను అందించినట్లు తెలిపారు. శ్రీ సద్గురు దత్త కృపాలయం వారు ముందుకొచ్చి విరాళం చేసిన సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, శ్రీ సద్గురు దత్త సేవా సిబ్బంది, మల్లారెడ్డి, శ్రీధర్, రాకేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎండి. డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ , హాజరయిన వైద్యులు, సిబ్బంది

107 క్యాత్ ల్యాబ్ ప్రొసీడర్స్‌ను పూర్తిచేసుకున్న జెమ్ కేర్ కామినేని హాస్పిటల్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

హాస్పిటల్ స్థాపించిన అతికొద్ది కాలంలోనే 107 క్యాథ్‌ల్యాబ్ ప్రొసీడర్స్‌ను పూర్తి చేసుకున్నట్లు జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ ఎండి.డాక్టర్ చంద్రశేఖర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. ఇందులో 84 కోరినరి అంజియో గ్రామ్స్, 21 పిటిసిఎ, 1పిఎటి, ఒక ఇపిఎస్,ఆర్ఎఫ్ ఎ ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జె మ్ కేర్ కామేనినే హాస్పిటల్‌లో కేక్ కట్టింగ్ నిర్వహించారు. మరెన్నో పూర్తి చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ రవిబాబు(ఆర్థో పెడిసియన్), డాక్టర్ ఆదిత్య(అనస్తీషియా), డాక్టర్ రామ్ మోహన్ రెడ్డి (ఇమర్జెన్సీ కేర్), సిఒఒ డాక్టర్ గణేష్ , ఆపరేషన్స్ హెడ్ నదీమ్, మార్కెటింగ్ హెడ్ రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, తన సోదరులు, టిటిడి బోర్డు సభ్యులు సీతారామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. బుధవారం మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం, స్థానికంగా నిర్మించిన రెండు ఆర్‌బికెలను, హెల్త్ క్లినిక్‌ను రిబ్బన్ కట్ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అంతకుముందు వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్‌పై ఎక్కి అందరికి అభివాదం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్ మీదుగా సంత మార్కెట్ వద్ద నిర్మించిన ఆర్‌బికె సెంటర్‌ను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో నిర్మించిన ఆర్‌బికె సెంటర్‌ను, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఎంపిటిసి జి.వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, నాయకులు గోరుకల్లు కృష్ణ స్వామి, జనార్దన్ రెడ్డి, శివకుమార్, చెట్నిహళ్లి సర్పంచ్ అంజినయ్య, ఉప సర్పంచ్ వీరన్న, ఎంపిటిసి రామాంజనేయులు, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ మణిమంజరి పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రతి వార్డు అభివృద్ధికి రూ.20 లక్షలు

- మున్సిపల్ చైర్పన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

పట్టణం, శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్పన్ శాంత, వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు రాజా సాహెబ్ నగర్, నాగప్ప గుంత ప్రాంతాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. రాజా సాహెబ్ నగర్‌లో కాలువలు నిర్మించాలని, రోడ్డు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టిన వార్డుల అభివృద్ధికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తోందని తెలిపారు. ఆ నిధులతో సిసి రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. వార్డు కౌన్సిలర్ శాంతి, ఇన్‌ఛార్జీ కురువ మల్లికార్జున, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ ఇంజినీరు రాధాకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్లు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి, వార్డు సెక్రటరీలు అమరేష్, భద్ర, వైసిపి పట్టణాధ్యక్షులు దేవా, నాయకులు సన్నీ, రైల్వే ఈరన్న ఉన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న శాంత, వైసిపి నాయకులు

రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారమివ్వాలి

- జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేంద్ర నాయుడు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొని ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బేతపల్లి, కోటకొండ, బంటుపల్లి తదితర గ్రామాల్లో వర్షాల్లేక వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు కురవకపోవడంతో పంటలు మధ్యలోనే ఎండిపోయాయని, పంటల కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్, రాముడు, ముని, హనుమంతు, జాకీర్, భాస్కర్, విష్ణు, వంశీ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఎఐఆర్‌టిడబ్ల్యుయు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆటో రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యులు బి.కృష్ణ, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆటో స్టాండ్‌లో 'చలో విజయవాడ' కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 6న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. ఆటో, రవాణా, కార్మిక యూనియన్ నాయకులు రాజు, షబ్బీర్, శీను, తేజ, ఉరుకుందు, వలీ, మధు, వెంకటేష్, రంగస్వామి, మోహన్ దాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై 'సిపిఎం సమర శంఖం'

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై ఈనెల 1 నుంచి నవంబర్ 7 వరకు సిపిఎంగా 'సమర శంఖం' కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న తెలిపారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులు, కూలీలు, సామాన్యుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మతోన్మాద విధానాలను అమలు చేస్తూ సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రజా ఉద్యమాలపై నిరంకుశంగా వ్యవహరిస్తోందని, సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, నిరుద్యోగ సమస్య, ఉపాధి హామీ చట్టం అమలు తీరుపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'వ్యవసాయ రంగంలో సంక్షోభం-ప్రభావం' అంశంపై ఈనెల 12న కర్నూలు నగరంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న ఆదోని నుంచి రాష్ట్రస్థాయి బస్సుజాతా ప్రారంభమవుతుందని చెప్పారు. రైతులు, కూలీలు, నిరుద్యోగ యువత, సామాన్యులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సిపిఎం మండల నాయకులు అయ్యప్ప, బాష, చిన్న తిక్కన్న, తిక్కప్ప, శాఖ కార్యదర్శులు పాండురంగ, గోవిందు, హనీఫ్ బాష, తాయప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి వార్తకు స్పందన...

- కెజిబివిని సందర్శించిన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

'కెజిబివి ఆకలి కేకలు' అనే శీర్షికకు జిల్లా అధికారులు స్పందించారు. బుధవారం కెజిబివిని సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనం అందించాలని ప్రిన్సిపల్‌ను హెచ్చరించారు. విద్యార్థినుల తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తించకుండా వారిని గౌరవించి తన ఛాంబర్‌లో కుర్చీలో కూర్చోబెట్టుకుని సమస్యలు అడిగి పరిష్కరించాలని సూచించారు. విద్యార్థినులతో చపాతీలు చేయించడం, కూరగాయలు కోయించడం వంటి పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాలయంలో సమస్యలు ఉన్నాయని సమాచారం అందుకుని విలేకరులు వచ్చినప్పుడు ఆంక్షలు విధించరాదని, వారు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటున్నారని తెలిపారు. వారు ఎక్కడికైనా రావచ్చని చెప్పారు. ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్నప్పుడు బాధ్యతయుతంగా వ్యవహరించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి వారి హక్కులు హరించరాదన్నారు. ఇప్పటికైనా మార్పు తెచ్చుకొని సమస్యలు పునరావృతం కాకుండా చూసుకొని విద్యార్థినుల తల్లిదండ్రులకు సహకరించాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ జిసిడిఒ సునీత, ఎంవైఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతి, గూడూరు ఎంఇఒ సునీలమ్మ, ఎంఇఒ జగన్నాథం, సిఆర్‌పిలు ఎం.లక్ష్మప్ప, తుకారాం, రేణుక పాల్గొన్నారు.

విచారిస్తున్న ఎంవైఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ మారుతీ

గర్భిణులు, బాలింతలకు ఐసిడిఎస్ ఒక వరం

- ఆలూరు సిడిపిఒ లలిత

ప్రజాశక్తి - చిప్పగిరి

గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఒక వరం లాంటిదని ఆలూరు సిడిపిఒ లలిత తెలిపారు. బుధవారం చిప్పగిరి సచివాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సిడిపిఒ లలిత, ఎంపిడిఒ కొండయ్య, ఇఒఆర్‌డి నాగభూషణం, ఎంఇఒ సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఒ లలిత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పదిమంది గర్భిణులకు సీమంతం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఐదుగురికి అన్నప్రాసన నిర్వహించామన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. న్యూట్రిషన్ గార్డెన్‌లో పండించిన కూరగాయలను గర్భిణులు, పిల్లలకు వడ్డించడంతో వారికి కలిగే ప్రయోజనాలను వివరించారు. చివరి రోజున బెస్ట్ బేబీగా ఎంపికైన వారికి, హెచ్ బి టు నంబర్ వన్ గర్భిణీగా ఎంపికైన వారికి బహుమతులను కూడా ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. బహుమతుల కోసం ఎంపిడిఒ సివి.కొండయ్య రూ.1000 నగదును, ఇఒఆర్‌డి నాగభూషణం రూ.1000 నగదును అందజేశారన్నారు. అంగన్వాడీ టీచర్లు హరిత, రామతులసి, పద్మ, శేష పుల్లమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

ఎకరాకు రూ.30 వేలివ్వాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - మంత్రాలయం

కరువు సహాయం కింద రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సూగూరు గ్రామంలో రైతు సంఘం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఈసారి కరువు తీవ్రంగా ఉందని తెలిపారు. సూగూరు గ్రామానికి కనీసం ఒక్క ఎకరాకు కూడా సాగునీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామానికి చెందిన వారు నిరంతరం వలసలు వెళున్నారని పేర్కొన్నారు. ఆర్‌డిఎస్ కింద ఈ గ్రామానికి చెందిన భూములను ప్రభుత్వం సేకరిస్తోందని, ఎకరాకు కనీసం రూ.30 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. రైతు సంఘం మండల కన్వీనర్ ఎస్.వీరేష్, నూతన అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- పంచాయతీ రాజ్ డిఇ షేక్షావలీ

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిఇ షేక్షావలీ

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించి, పనులు వేగవంతం చేయాలని ఆలూరు పంచాయతీ రాజ్ డిఇ షేక్షావలీ సూచించారు. బుధవారం దేవనకొండలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. ఇన్‌ఛార్జీ ఇంజినీర్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టి నమోదు చేయాలి : ఈఆర్‌ఓ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం-147లో బిఎల్ఒలు ఓటరు సవరణలో సమగ్ర విచారణ చేపట్టి నమోదు చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం ఆలూరు మండల పరిషత్ కార్యాలయంలో మల్లికార్జున అధ్యక్షతన గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు, తహశీల్దార్లు, బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిఎల్ఒలు ప్రతి ఇంటికీ వెళ్లి విచారించి యాప్‌లో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫారం-6, 7, 8లో నమోదు చేసి దరఖాస్తు చేయాలని తెలిపారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి తహశీల్దార్లు రామాంజనేయులు, కుమార్ స్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'స్పందనలో సమస్యలను పరిష్కరించుకోండి'

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్పందన - జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఒ అల్లాబకాష్, తహశీల్దార్ రామాంజనేయులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. ఆలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 6న ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంగు మారిన నీరిస్తున్నారు...

- కౌన్సిల్‌లో ధ్వజమెత్తిన కౌన్సిలర్

ప్రజాశక్తి - ఆదోని

పుర ప్రజలకు మున్సిపాలిటీ కుళాయిల ద్వారా వస్తున్న నీరు రంగు మారి ఉంటున్నాయని, అవి తాగిన వారు రోగాలు బారిన పడే ప్రమాదం ఉందని, అపోహలను నివృత్తి పరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కౌన్సిలర్ బాలాజీ తెలిపారు. బుధవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ శాంత అధ్యక్షతన అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది.

కోరం కోసం ఎదురుచూపు

కోరం కోసం అధికారులు ఎదురుచూడాల్సి వచ్చింది. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం గంట ఆలస్యమైంది. 42 మంది సభ్యులుండగా సమావేశానికి 18 మంది హాజరయ్యారు. 14 మంది కోరం అవసరం కావడంతో సమావేశం ప్రారంభమైంది. ఛైర్మన్ శాంత మాట్లాడారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు బండ్ శిథిలావస్థకు చేరిందని, మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. పనులు చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కోసం అత్యవసర సమావేశం నిర్వహించాల్సి వచ్చిందన్నారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... గతనెల 27న జరిగిన మున్సిపల్ కౌన్సిల్‌లో పలు సమస్యలు లేవనెత్తినప్పటికీ పరిష్కారం కాలేదని అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. వేసవిలో నీటి వాడకం పెరుగుతుందని, అందుకనుగుణంగానే ట్యాంకులు, కుళాయిలకు మరమ్మతులు చేయించాలని కోరినా ఎక్కడా పనులు జరిగిన దాఖలాలు లేవని తెలిపారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ మాట్లాడుతూ... నీటి సరఫరా సమయంలో ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి పరుస్తామన్నారు. పంపు హౌస్ వద్ద నీటిని క్లోరినేషన్ చేసి వదులుతున్నామని వివరించారు. త్వరలోనే నీటి ట్యాంకులకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ ఇంజినీర్ గోపీనాథ్ కౌన్సిలర్లను పరిచయం చేసుకున్నారు. తాను రాయదుర్గం నుంచి వచ్చానని తెలిపారు.

ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం నిధుల కేటాయింపు

ఆదోని పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు బండ్ మరమ్మతుల కోసం నిధుల కేటాయింపు జరిగిందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి వివరించారు. 2003లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును రూ.37.75 కోట్లతో నిర్మించారని తెలిపారు. 2007లో పురప్రజలకు అంకితం చేసినట్లు చెప్పారు. అప్పటి నుంచి మున్సిపాలిటీ పరిధిలో మెయింటనెన్స్ ఉందన్నారు. ప్రస్తుతం ట్యాంకు లోపలి బండ్ కాంక్రీట్ లైనింగ్ 105 మీటర్లు డ్యామేజ్ అయిందన్నారు. దాని మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా యుద్ధ ప్రాతిపదికన రూ.55 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు మొదలు పెడతామన్నారు. తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా రాంజల నీటిని ప్రజలకు సరఫరా చేసేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటిని టెస్టింగ్ కోసం పంపామని, అక్కడి నుంచి అనుమతి రాగానే ఆయా ప్రాంతాలకు సరఫరా చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, చలపతి చిన్న, ఉస్మాన్, అశోక్, సురేష్, లోకేశ్వరి, మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఇంజినీర్లు నాగభూషణం, వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, చంద్రమోహన్ ఉన్నారు.

కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కౌన్సిలర్ బాలాజీ

సిడిపిఒగా నిర్మలా దేవి బాధ్యతలు

ప్రజాశక్తి - ఆదోని

శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ఆదోని ప్రాజెక్టు సిడిపిఒగా నిర్మలాదేవి బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆస్పరి ప్రాజెక్టు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చామని తెలిపారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయిస్తామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా పని జరిగేలా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ అంగన్వాడీల సమన్వయంతో పని చేసి శాఖ ఉద్దేశాలను నెరవేరుస్తామని తెలిపారు. కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

'చలో విజయవాడకు తరలిరండి'

ప్రజాశక్తి- దేవనకొండ

రవాణా రంగ కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాపాడాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఈనెల 6న చేపట్టే 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి అశోక్ కోరారు. బుధవారం దేవనకొండలో ఆటో కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, టిడబ్ల్యు యాక్ట్ ప్రయోజనాల చట్ట పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆటో కార్మికులు రంగయ్య, బ్రహ్మయ్య, నరేష్, రంగన్న, తిప్పన్న, గోపాల్ పాల్గొన్నారు.

'ఒక్క ఛాన్స్' అయిపోయింది...

- చంద్రబాబు చేసిన తప్పేంటో నిరూపించు.. జగన్...

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలను కోరిన 'ఒక్క ఛాన్స్' అయిపోయిందని, ఇక చాలంటూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షలో చేపట్టారు. కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు చేసిన తప్పేంటో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించే సమయంలో ఈలలు, కేకలు వేసి దీక్ష శిబిరం ముందు నుంచే వెళ్తూ టిడిపి శ్రేణుల సహనాన్ని పరీక్షిస్తున్నారని తెలిపారు. జగన్ నేర్పిన సంస్కృతి ఇదేనా అని ప్రశ్నించారు. టిడిపి క్రమశిక్షణకు మారుపేరని కొనియాడారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, ఆర్‌టిఎస్ కన్వీనర్ దశరథ రాముడు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు దీక్షలో కూర్చున్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్‌రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడిగప్ప గౌడ్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు బాపురం సుధీర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోట్రేష్ గౌడ్, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు భరత్ శెట్టి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శులు ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, బీసీ సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, కురుగోడు, అశోక్ రెడ్డి, విజయ రామిరెడ్డి, మైనార్టీ అధ్యక్షులు టిప్పు సుల్తాన్, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, మాధవరం సాయికుమార్ రెడ్డి, చిన్నబొంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, వందగల్ మాజీ సర్పంచి నరసింహులు, పల్లెపాడు మాజీ సర్పంచి చంద్ర, చిన్నతుంబలం వీరేష్ గౌడ్, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్ సాబ్, బెళగల్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచి రామయ్య, గుండేష్, ఉసేని, తిరుమలేష్, రాజు, జనార్దన్, ఆర్లబండ రామాంజనేయులు, అయ్యప్ప, వారం గోపాల్, వడ్డే ఉల్లిగయ్య, రంగారెడ్డి, గోపాల్, శ్యాంసుందర్, నర్సిరెడ్డి, రామాంజి, పాండు రంగ, నరసప్ప, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మారెప్ప, ఏసేపు, యోబు, బొగ్గుల నరసన్న, బసవలింగప్ప, ఎంపిటిసి రాజు, దేవన్న, బీసీ సాధికార సభ్యులు సిద్ధు, నక్కి వెంకటేశ్వర్లు, వట్టెప్ప గారి నరసింహులు, మేకల నరసింహులు, శివ, రామకృష్ణ, మదిరె వీరారెడ్డి, కంబాలదిన్నె శీను, హాల్వి హుసేని, మల్లప్ప గౌడ్, హనుమాపురం ఈరన్న, పెద్దయ్య, మహాదేవ, చిన్న సంఘీభావం తెలిపారు. **ఆదోని** ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మండల అధ్యక్షులు బసవరాజు, ప్రతాప్ రెడ్డి, టిఎన్‌టియుసి మల్లికార్జున, బాబు నాయుడు, శివ, హానవాల్ బాషలు అర్ధనగ్నంగా నిలుస్తూ ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు సాగాయి. సీనియర్ ఎన్‌టిఆర్ అభిమాని శంకర్ శాస్త్రి, జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాని చాంద్, విరుపాక్షి, మల్లేశప్ప, షణ్ముఖ, చాగి మల్లికార్జున, రంజిత్, నాగరాజు, నరసప్ప, శేషప్ప, మహేష్ దీక్షల్లో కూర్చున్నారు. రంగస్వామి నాయుడు, కృష్ణారెడ్డి, సాయిబాబు, లక్ష్మీనారాయణ, జెబి.రంగన్న ఉన్నారు. అలాగే ఆదోనిలోని రాయచోటి సుబ్బయ్య కాలనీలో టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపడుతూ, పోస్టుకార్డు ఉద్యమ చేపట్టారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, కర్నూలు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు జి.రామకృష్ణ, సాధిక్ వలీ, బాబురావు, నాగేంద్ర, గిరిధర్, వాల్మీకి నాయకులు ఈరన్న, బాలు, లక్ష్మి కాంత్ రెడ్డి, రవికుమార్, పరమేష్ ఉన్నారు. **ఎమ్మిగనూరు**లోని సోమప్ప సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 22వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి ఈడిగ సంఘం నాయకులు రామదాసు గౌడ్, రంగస్వామి గౌడ్, కొండన్న గౌడ్, శంకర్ గౌడ్, రాము గౌడ్‌లు దీక్షలో కూర్చున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య దీక్ష శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. సిపిఐ నాయకులు రంగన్న, వీరేష్, టిడిపి నాయకులు సుందర్ రాజు, కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, గురురాజ్ రావు దేశాయి, దయాసాగర్, కలీముల్లా, రామకృష్ణ నాయుడు, సోగనూరు డి.దస్తగిరి, మల్లికార్జున, కటారి రాజేంద్ర, దామ నరసింహాలు, బోయ రంగన్న, దాదా వలీ, నజీర్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)**లో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ 'చంద్రన్న కోసం మేము సైతం' అంటూ పట్టణంలోని ట్రాన్స్‌జెండర్స్ నినదించారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఆత్మ మండల మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, ముగతి వీరారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌జెండర్స్ సిరి, సాధిక్, నాగవేణి, పుష్ప, టిడిపి నాయకులు బనవాసి శ్రీకాంత్ రెడ్డి, టిడిపి మైనార్టీ నాయకులు కెఎండి.అబ్దుల్ జబ్బార్, గోరా బాషా, జోహార్ అబ్బాస్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, దర్జీ మోషన్న, ఎస్.సాల్మన్, టిడిపి నందవరం మండల నాయకులు కనకవీడు పెద్ద ఈరన్న పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో అర్ధనగ్న ప్రదర్శనలో మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు

ఎమ్మిగనూరులో దీక్షలో కూర్చున్న బీవీ, నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పోలీసు హైటెన్షన్ మధ్య వైసిపి, టిడిపి కార్యక్రమాలు

- వైసిపి బైక్ ర్యాలీ, అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం

- తిక్కారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న టిడిపి దీక్ష

ప్రజాశక్తి - మంత్రాలయం

హైటెన్షన్ మధ్య వైసిపి, టిడిపి కార్యక్రమాలు సాగాయి. అధికార పార్టీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆయన సోదరులు, టిటిడి బోర్డు సభ్యులు సీతారామిరెడ్డితో కలిసి అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు బైక్ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ మంత్రాలయం చేరుకుంది. ఇటు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. పోలీసుల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక వైపున ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆర్‌బికె, క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించేందుకు వైసిపి నాయకులు వచ్చారు. మరో వైపు రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి శ్రేణులు 25వ రోజు రిలే నిరాహార దీక్షలు చేటప్టారు. డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గ్రూపు బైక్ ర్యాలీ మొదలు కాగానే రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి చేపట్టిన దీక్ష శిబిరం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు కనిపించకుండా మాధవరం వైపు వెళ్తున్న లారీలను వరుసగా నిలిపేశారు. ఒక్క సారిగా వైసిపి నాయకులు బైక్ ర్యాలీతో ఈలలు, కేకలు వేయగా శబ్దాలు విన్న తెలుగు తమ్ముళ్లు ఒక్క సారిగా కేకలు, అరుపులతో ప్రతిధ్వనించారు. అప్రమత్తమైన డీఎస్పీ సీతారామయ్య దీక్ష శిబిరం నుంచి బయటకు ఎవరినీ రానీయకుండా సిబ్బందితో అడ్డుకున్నారు. రెండు గంటల పాటు నెలకొన్న హైటెన్షన్ పోలీసు వ్యూహంతో ప్రశాంతంగా ముగిసింది.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజారోగ్యం సిఎం లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

అందరికీ ఆరోగ్యాన్ని అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని కనకవీడు పేట గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. వైద్య పరీక్షలకు 306 హాజరు కాగా, 184 మంది మహిళలు, 122 మంది పురుషులు, 46 మంది బడిపిల్లలు హాజరయ్యారు. 64 మందికి కంటి పరీక్షలు, 10 మందికి కంటి అద్దాలు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి వ్యక్తికీ ఆరోగ్య సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని చెప్పారు. కనకవీడు పేట సర్పంచి సరస్వతి, ఎంపిడిఒ దశరథ రామయ్య, మండల విస్తరణ అధికారి ఈశ్వరయ్య, మండల వైద్యాధికారులు సౌజన్య, చిన్న పిల్లల డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ పరిమళ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం బిల్లేకల్లు గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ఎంపిడిఒ రణెమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ రఘురాం రెడ్డి, సర్పంచి శ్రీను, మండల కన్వీర్ పెద్దయ్య, డాక్టర్ గీతావాణి, దుర్గమ్మ, మహేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మన్న, సునీల్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. కర్నూలు నుంచి వచ్చిన వైద్యాధికారులు జనరల్ ఫిజిషియన్ డాక్టర్ విజ్ఞాన్ తరుణ్ కుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ గౌరప్ప పరీక్షలు నిర్వహించారు. ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారానికి సంబంధించిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, ఆర్ఐ సుబ్బారెడ్డి, గోనెగండ్ల పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కార్తీక్, అపర్ణ, సర్పంచి నరసన్న, ఉపేంద్ర, ఎంపిహెచ్ఈఓ హనుమంతు, ఎంపిహెచ్ఎస్ రమేష్, శాంతమ్మ, పిహెచ్ఎన్ భారతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నందవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆస్పరిలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ గీతావాణి

గోనెగండ్ల మెడికల్ క్యాంపు వద్ద ఉన్న అధికారులు

కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు తదితరులు

'యూరియా' కష్టాలు..

- లెక్కల్లో మాత్రం 2636 మెట్రిక్ టన్నులు అందుబాటులో.. - ఆర్‌బికెల్లో ఒక్క బస్తా కూడా కనిపించని వైనం
- తీవ్ర ఇబ్బందుల్లో రైతులు - కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రయివేటు ఏజెన్సీలు
- బహిరంగ మార్కెట్‌లో బస్తాపై రూ. 30 నుంచి 100 దాకా అదనం
- అది కూడా కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే.. - పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. యూరియా లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు.. సరైన వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న రైతాంగంకు యూరియా కొరత పట్టీ పీడిస్తుంది. వర్షాభావ పరిస్థితులతో ఆరుతడి పంటలు సాగు చేసుకున్న అన్నదాతకు పూర్తి స్థాయిలో ఎరువులను అధికార యంత్రాంగం అందించలేకపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్న యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో 2,636 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అందులో ప్రయివేట్ ఏజెన్సీల వద్ద దాదాపు 1,530 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 1,100 మెట్రిక్ టన్నులు, గోదాముల్లో 5.5 మెట్రిక్ టన్నులు యూరియా ఉన్నట్లు వ్యవసాయ అధికార వర్గాల సమాచారం.. కానీ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో యూరియా లేదు. యూరియా అవసరమయిన రైతులు ఆర్‌బికెలలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అక్కడికి వెళ్లిన రైతులకు చుక్కలు కనపడుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నా సరైన సమయానికి యూరియా అందడం లేదు. మార్క్‌ఫెడ్ నుండి సొసైటీలకు వెళ్లిన యూరియా కూడా వ్యాపారుల చేతుల్లోకి వెళుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా బండి ఆత్మకూరు, మహానంది, సిరివెళ్ల, రుద్రవరంతో పాటు పలు మండలాల్లో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఎక్కువగా ప్రయివేట్ ఏజెన్సీలు కృతిమ కొరత సృష్టిస్తూ రూ.270 ఉన్న బస్తా యూరియాను రైతులకు అధికంగా రూ.300 నుండి రూ.450 వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల లెక్కల ప్రకారం యూరియా సమృద్ధిగా ఉన్నా రైతులకు మాత్రం అందడం లేదనేది స్పష్టంగా కనపడుతుంది. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పైరు పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో తప్పకుండా యూరియాతో పాటు పొటాష్ చాలా అవసరం. అలాగే మొక్కజొన్నకు కూడా అవసరం. కానీ యూరియాతో పాటు పొటాష్ కొరత తీవ్రంగా ఉంది. యూరియా, పొటాష్ కోసం రైతులు ఆర్‌బికెల చుట్టూ, ప్రయివేటు దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో యూరియా కావాలంటే అదనంగా కాంప్లెక్స్ ఎరువులు కుడా తీసుకోవాలని ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యాలు మెలిక పెడుతున్నారు. తప్పనిసరిగా కొనాల్సిందేనని చెబుతున్నారు. దీంతో రైతులకు అదనపు భారం పడుతోంది. తక్షణమే యూరియాను అందించాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో యూరియా కొరత తీర్చాలి

జిల్లాలో యూరియా కొరతతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు యూరియా కొరత లేదు. కావలసినంత అందుబాటులో ఉందని చెబుతున్నారు. ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంది. ఇప్పటికే రుద్రవరం, సిరివెళ్ల, మహానంది మండలాల్లో ఆర్‌బికెల్లో, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల్లో దొరకడం లేదు. కొన్ని ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా రూ.300 నుండి రూ.400 వరకు అమ్ముకొని రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారు. బస్తా యూరియా కావాలంటే అదనంగా రెండు మూడు బస్తాలు కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే ఇస్తామని ఖరాఖండిగా చెబుతున్నారు. సబ్సిడీ ధరకు సొసైటీలకు రావాల్సిన యూరియా దొడ్డిదారిన బ్లాక్ మార్కెట్‌కు వెళ్లిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని జిల్లాలోని రైతులందరికీ సరిపడా యూరియాను సరఫరా చేయాలి. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి.

టి.రామచంద్రుడు. జిల్లా సహాయ కార్యదర్శి.ఏపీ రైతు సంఘం.

ఆర్‌బికెల్లో యూరియా దొరకడం లేదు..

పాములపాడు మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం పంటలకు యూరియా, పొటాష్ అవసరం ఉంది. కానీ ఆర్‌బికెలలో దొరకడం లేదు. కాబట్టి అధికారులు యూరియా పైన దృష్టి పెట్టి సరఫరా చేయాలి.

ఎం.సుబ్బన్న, లింగాల గ్రామ రైతు, పాములపాడు మండలం.

సామాన్యులకు అందని యూరియా

నేను నాలుగు ఎకరాలు మిరప పంట వేశాను. పంటకు యూరియా దొరకడం లేదు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. సచివాలయంలో పెద్దలకే యూరియా. సామాన్యులకు లభించడం లేదు. సిబ్బందిని అడిగితే ఆర్డర్ పెడితేనే యూరియా వస్తుంది లేకపోతే లేదని జవాబు ఇస్తున్నారు. బయట మార్కెట్లో నాలుగు బస్తాలు డిఏపి తీసుకుంటే ఒక బస్తా యూరియా కూడా ఇవ్వడం లేదు. పర్మిషన్ లేదని, యూరియా స్టాక్ లేదని చెబుతున్నారు. యూరియా కొరతతో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదు.

- ఎల్లయ్య, చాపిరేవుల గ్రామం రైతు, నంద్యాల మండలం.

ఆర్‌బికెలలో యూరియా అందుబాటులో ఉంది

జిల్లాలో 1,209 మెట్రిక్ టన్నులు యూరియా ఆర్‌బికెలలో ఉంది. ఎలాంటి సమస్య లేదు.. బయట ఫర్టిలైజర్ షాపులలో కుడా అందుబాటులో ఉంది. ఈ నెల 3, 4 తేదీలలో 2 వేలకు పైగా మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుంది.

- జిల్లా వ్యవసాయ అధికారి మెహన్ రావు

సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు

- నంద్యాల మండలం రాయమాల్పురంలో రూ. 4.41కోట్లతో ఏర్పాటు
- వర్చువల్ విధానంలో భూమి పూజ చేసిన సిఎం జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో రూ. 4.41 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటుకు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో భూమి పూజ చేశారు. తరాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో మొత్తం రూ. 2958.69 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏడు పరిశ్రమల యూనిట్లు, 6 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 13 సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాలను కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, మార్క్ ఫెడ్ చైర్మన్ పి.పి.నాగిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, ఏపి ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ రామలింగారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఇతర అధికారులు పాల్గొని వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తయితే చిరుధాన్యాలు సాగు చేసే రైతులందరికీ ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. ప్రజలందరూ చిరుధాన్యాలను ఆహార పదార్థాలుగా వినియోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు చిరుధాన్యాల ఉత్పత్తుల రైతులను ప్రోత్సహించాలన్నారు. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి చిరుధాన్యాలు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఆర్బికెల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులతో పాటు రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నారన్నారు. నంద్యాల ఎంపీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచిందన్నారు. పూర్వపు రోజుల్లో ప్రజలు చిరుధాన్యాలను అధికంగా వినియోగించి పూర్వీకులు చాలా సంవత్సరాల పాటు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిం దన్నారు. నంద్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు చెంది చిరు ధాన్యాలు వినియోగించడం ఒక భాగమైం దన్నారు. చిరుధాన్యాల సాగు పెంపునకు సంబంధించి నంద్యాల నియోజకవర్గంలో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసిన ముఖ్యమంత్రికి రైతులందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో రూ. 4.41 కోట్లతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటు శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తదితరులు ఆవిష్కరించారు.

ఇందిరానగర్‌లో సిమెంట్ రోడ్లు వేయాలి

- బురద రోడ్డులో వరి నాట్లు వేసి సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ పట్టణంలోని ఇందిరానగర్‌లో సిమెంట్లు రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు ఏ.సురేంద్ర, జి. నాగేశ్వరావులు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరానగర్‌లోని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బురదమయంగా ఉన్న రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా నగర్ కాలనీ ఏర్పాటై దాదాపు 30 సంవత్సరాలు దాటుతున్నా కాలనీలోని పలు వీధులలో సిమెంట్ రోడ్లు లేక చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి బురదమయంగా మారుతుందన్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడి కాలనీ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. వెంటనే సిమెంట్ రోడ్లు వేసి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో కాలనీల ప్రజలను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందర ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మహమ్మద్, ఇందిరానగర్ కాలనీ ప్రజలు గిరి రాజు, చింతలయ్య, భారతి, విజయమ్మ, మార్తమ్మ, సుశీలమ్మ, బోధకమ్మ, నాగలక్ష్మమ్మ, రాజేశ్వరమ్మ,, శ్యామలమ్మ, శేఖర్, విజ్జమ్మ, రాములమ్మ, అరుణ, ఆశీర్వాదమ్మ పాల్గొన్నా రు.

రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు ప్రజలు

భక్తుల రద్దీకనుగుణంగా సౌకర్యాలు : ఇఒ

ప్రజాశక్తీ - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు చేపట్టాలని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పెద్దిరాజు సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక పరిపాలన భవనంలో ఆయా సెక్షన్ యూనిట్ అధికారులతో, పర్యవేక్షకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా సామాన్య భక్తుల సౌకర్యార్థం మరిన్ని డార్మెంటరీలు, సౌచాలయాలు నిర్మించేందుకు అంచనాలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వారాంతపు రోజులలో సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని పరిపాలన విభాగాన్ని ఆదేశించారు. దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ విరాళాల పథకాలకు మరింత దాతల సహకారాన్ని పొందేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మాట్లాడుతున్న ఇఒ పెద్దిరాజు

నేడు జీవీ మాల్ ప్రారంభోత్సవం

- ప్రముఖ సినీనటీ అనసూయ రాక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు నంద్యాలలో ప్రముఖ కార్పొరేట్ స్థాయి జీవీ మాల్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ నటి అనసూయ రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రధానంగా తెలంగాణతోపాటు, ఎపిలోనూ తమ బ్రాంచీలు ఉన్నాయని, ఖమ్మం, కొత్తగూడెం, కోదాడ, మిర్యాలగూడ, సత్తుపల్లి, రాజమండ్రి, గుడివాడ, జంగారెడ్డి గూడెం, ఏలూరు, బీదర్‌లతో పాటు ఇప్పుడు మన రాయలసీమలో మొట్టమొదటి సారిగా నంద్యాల జిల్లా కేంద్రంలో జివి మాల్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కస్టమర్లకు అందుబాటులో ఉండేలా జీవీ షాపింగ్ మాల్‌లో బట్టలు ఉన్నాయన్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, రంజాన్ క్రిస్మస్, బక్రీద్ వంటి పండుగల సందర్భంగా మంచి ఆఫర్లతో ప్రజల ముంగిట వస్త్రాలు ఉండబోతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

గూడెంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

పెద్దారుట్ల చెంచు గిరిజన గూడెంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు. వై. ఆశీర్వాదం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దోర్నాల మండల తహసిల్దార్‌కు కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు. వై. ఆశీర్వాదం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన హసిల్దార్ పెద్దారుట్ల చెంచు గిరిజనుల సమస్యల్ని ఫారెస్ట్ అధికారులకు ఫైల్ ఫార్వర్డ్ చేశామన్నారు. అన్ని చెంచు గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు కోసం కృష చేస్తామన్నారు. కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం, అల్లూరి సీతారామరాజు ఆదివాసి గిరిజన సంక్షేమ సంఘం దోర్నాల మండల అధ్యక్షుడు దంసాని వెంకటేశం, కుడుముల వెంకటేశ్వర్లు, భ్రమరాంబ, మల్లిక, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి బజాజ్ పల్సర్ ఎన్-150 సిసి విడుదల

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంది ఒజీజ్ నంద్యాల బజాజ్ షో రూంలో బుధవారం బజాజ్ పల్సర్ ఎన్-150 సిసి బైక్‌ను నంద్యాల ఎస్ఎంఇ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి.నవీన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నంది బజాజ్ అధినేత చింతా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్-150 సిసి శక్తివంతమైన, ఉత్సాహపూరితమైన క్యారెక్టర్ లైన్స్, డైటర్ ప్రొ పోర్షన్స్, ఆధునిక ఏరో డైనమిజం కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ విభాగంలో అత్యుత్తమ ఫీచర్లు, రోడ్డుపై ఆకట్టుకునే పనితీరు కలిగి అందరికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దీనిని రూపొందించారని తెలిపారు. షోరూం జనరల్ మేజర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ వాహనం 150 సిసిని కలిగి, 5 స్పీడ్ గేర్ బాక్స్, సింగల్ ఛానల్ ఏబిఎస్ ట్యూబ్లెస్ టైర్స్, ఎల్ఈడి పైలట్ లాంప్స్ , 14.5 పిఎస్ గరిష్ఠశక్తి, 13.5 ఎన్ఎం టార్క్‌ను కలిగి ఉందన్నారు. మోనోషాక్ సస్పెన్షన్‌తో ఈ బైకు మూడు అద్భుతమైన రంగులలో రేసింగ్ రెడ్, ఎబోనీ బ్లాక్ మెటాలిక్ పెరల్ వైట్‌లలో లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి కస్టమర్‌కు టెస్ట్ రైడ్ అవకాశాలను కల్పించినట్లు తెలిపారు. అనంతరం కస్టమర్‌కు ముఖ్య అతిధుల చేతుల మీదుగా ఎన్-150 సిసి బైక్‌లను డెలివరీ ఇప్పించారు. కార్యక్రమంలో వర్క్స్ మేనేజర్ నాగరాజు, షోరూం సిబ్బంది, కస్టమర్‌లు పాల్గొన్నారు.

బజాజ్ పల్సర్ ఎన్-150 సిసి బైక్‌ను కస్టమర్‌కు అందజేస్తున్న నంది బజాజ్ షోరూం అధినేత చింతా సుదర్శన్ రెడ్డి

అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

అంధులు కంటి చూపు లేదని దిగాలు పడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పట్టణ మాజీ సర్పంచ్, జిల్లా టెలికాం బోర్డు అడ్వైజరీ కమిటీ మాజీ సభ్యులు బిసి రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాలనీలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తన తండ్రి కీ.శే. బిసి గుర్రెడ్డి జ్ఞాపకార్థం అంధులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంరం అంధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తండ్రి బిసి గుర్రెడ్డి జ్ఞాపకార్థం 2009 నుంచి సొంత డబ్బులతో 14 ఏళ్లగా ప్రతినెలా 1వ తేదీనే అంధులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్నట్లు తెలిపారు. పింఛన్‌ను దశల వారీగా పెంచుతూ ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున 160 మందికి ప్రతి నెలా 1వ తేదీన రూ.80 వేలు నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం నేటితో 15 వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. కంటి చూపుతో చూడలేకపోయినా మనసుతో ఊహించి గ్రహించుకునే శక్తి సామర్థ్యాలు వారిలో ఉంటాయన్నారు. నేటి సమాజంలో అంధులంటే చిన్నచూపు చూడకుండా ప్రతి ఒక్కరూ వారికి చేయూతనివ్వాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి కర్నూల్, నంద్యాల జిల్లాలో అర్హులైన అంధులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. అనంతరం అంధులకు, వారితో పాటు వచ్చిన సహాయకులకు బిసి రాజారెడ్డి భోజనం వసతి ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో బొబ్బల మహేశ్వర రెడ్డి, బలరామయ్య, నుసి విష్ణువర్ధన్ రెడ్డి, రాయలసీమ సలాం పాల్గొన్నారు.

అంధులకు పింఛన్లను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

ఆశ వర్కర్స్‌తో ఇతర పనులు చేయించరాదు : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఆశ వర్కర్స్‌తో సంబంధం లేని ఇతర పనులు చేయించ రాదని, వేధింపులు, బెదిరింపులు ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.భాస్కర్ రెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా సమావేశం పిహెచ్‌సి కార్యదర్శి రసూల్ బి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలన్నారు. నాణ్యమైన సెల్ ఫోన్‌లు, 4 జి సిమ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీహెచ్‌సిలకు పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఏ, డిఏ ఇవ్వాలని వారు కోరారు. ఆశ వర్కర్స్‌కు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం పిహెచ్‌సి నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా రసూల్ బి, ఉపాధ్యక్షులుగా రాజ్యలక్ష్మి, కార్యదర్శి ఎన్ భారతి, సహాయ కార్యదర్శి రత్నమ్మ, కోశాధికారిగా శ్యామలమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సునీతమ్మ, పార్వతమ్మ, నిర్మలమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి

ఇకెవైసి పూర్తి చేయాలి : ఎడి

ప్రజాశక్తి - కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల రైతుల పంట నమోదు ఈ కేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆత్మకూరు ఏడి బి ఆంజనేయ తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రమఠం, ముసలమడుగు గ్రామాల రైతు భరోసా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి మహేష్ ఆధ్వర్యంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆర్బికే సిబ్బందికి సూచించారు. మండలానికి 250 క్వింటాళ్ళ శనగ విత్తనం మంజూరైందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతు భరోసా కేంద్రం మాట్లాడుతున్న ఏడి

న్యూస్ క్లిక్‌పై కేంద్రం దాడులను వ్యతిరేకించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తన్యూస్ క్లిక్ మీడియాపై, కార్యాలయంపై, సిబ్బందిపై దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రజా స్వామ్యవాదులందరూ వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వ విధానాలను ఎత్తిచూపుతూ రాస్తున్న న్యూస్‌క్లిక్‌పై దాడులు చేయడం, పత్రిక స్వేచ్ఛను హరించడమేనన్నారు. న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీదు పురస్కారయపై దాడి చేసి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇంటి పైన కూడా దాడి చేసి సోదా చేయడాన్ని పార్టీ జిల్లా కమిటీగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, ప్రతిపక్ష పార్టీలు, అందరూ కూడా ఈ దాడులను ఖండించాలని కోరారు.

15న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన పాత్రికేయ సమావేశంలో పోటీల వివరాల కరపత్రాలను రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా చెస్ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ రామకష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆరు వయసు కేటగిరీలలో బాల బాలికలకు వేరువేరుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున జాతీయ స్థాయిలో పాల్గొనే జట్ల ఎంపికలు కూడా నిర్ణయించనున్నట్లు చెప్పారు. ఈ నెల 10వ తేదీ లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని నంద్యాల జిల్లా పరిసర ప్రాంతాల చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 9010451585 సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పివి సుధాకర్ రెడ్డి, సోమేశ్వర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రూ. 60 లక్షల ఉపాధి నిధులతో సిసి రోడ్ల నిర్మాణాలు

- పుట్లాలమ్మ దేవస్థానం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో రూ.60 లక్షల జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పుట్లాలమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ సీనియర్ వైసీపీ నాయకులు గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎర్రగుడిదిన్నె గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 100 శాతం సిసిరోడ్ల నిర్మాణాలు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రుద్రవరంకు రూ 15 లక్షలు, ఆలమూరు రూ 10 లక్షలు, కోటకొండ రూ 5 లక్షలు, ముత్తలూరు రూ.5 లక్షలు, నల్ల వాగు పల్లె రూ.5 లక్షలు, పేరూరు రూ. 3 లక్షలు, బి నాగిరెడ్డిపల్లె రూ.2 లక్షలు, చిలకలూరు రూ.5 లక్షలు, మందలూరు రూ 5 లక్షలు, చందలూరు రూ 5 లక్షల ప్రకారం నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో త్వరలోనే సిసి రోడ్ల నిర్మాణాలు మొదలు పెడతామని తెలిపారు.

మాట్లాడుతున్న గంగుల మనోహర్ రెడ్డి

చిన్నారిపై కుక్క దాడి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని బాచేపల్లి తండాకు చెందిన దేశానాయక్ కూతురు చిన్నారి నాలుగేళ్ల హర్షితపై బుధవారం కుక్క దాడి చేసింది. ఈ దాడిలో చిన్నారికి గాయాలయ్యాయి. హర్షిత స్కూల్ నుండి ఇంటికి వస్తుండగా ఇంటికి సమీపంలో ఉన్న పెంపుడు కుక్క చిన్నారిపై దాడి చేసింది. గమనించిన చిన్నారి తండ్రి దేశ నాయక్ చిన్నారిని కుక్క దాడి నుండి కాపాడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో అహోబిలంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రధమ చికిత్స చేయించాడు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణం 6వ వార్డులో స్థానిక కౌన్సిలర్ పురందర్ కుమార్ ఆద్వర్యంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా రూ. 35 లక్షల అభివద్ధి పనులను బుధవారం ఘనంగా ప్రారంభించారు. రూ. 14 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్, రూ. 21.5 లక్షలతో మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటు చేశారు. వార్డు ప్రజల తరుపున కౌన్సిలర్ ఎమ్మెల్యేకు, ఎమ్మెల్సీకి, చైర్మన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ మాట్లాడుతూ 6వ వార్డులో ఎమ్మెల్యే చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో నిధులను మంజూరు చేయించి వెంటనే పరిష్కరించాని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్ బాషీద్, స్థానికనాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చైర్మన్‌లు

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామీణ ప్రాంతంలోని ప్రజలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష వరంలాంటిదని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. బుధవారం పాములపాడు మండలంలోని జూటూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆర్థర్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. పేదలందరికీ అన్ని రకాల వైద్యం సురక్ష ద్వారా అందుతుందని తెలిపారు. అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం సురక్ష కార్యక్రమంలో మందుల పంపిణీ, బీపీ చెకప్ కౌంటర్లను పరిశీలించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక, డిప్యూటీ డిఎంహెచ్ఓ కాంతారావు నాయక్, డాక్టర్ నాగలక్ష్మి దేవి, ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, డాక్టర్స్ దీప, నాగవేణి, టిబి సూపర్వైజర్ చెరుకు రవికుమార్, పంచాయితీ కార్యదర్శి పుల్లయ్య, వైస్ ఎంపీపీ, వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు మధుసూదన్ రావు, మండల నాయకులు రమణారెడ్డి, నాయకులు మద్దిలేటి, ఉపేంద్ర, రాజన్న, రుద్రవరం సర్పంచ్ రామస్వామి, మద్దూరు ఎంపీటీసీ బషీర్ అహ్మద్, నాయకులు జబ్బర్, బాలేశ్వర్ రెడ్డి, దానమయ్య సచివాల సిబ్బంది హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి :** మండలంలోని మద్దూరు గామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను ఎంపిపి వీరభద్రుడు, బ్రాహ్మణ పల్లె సర్పంచ్ మహేశ్వరి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపిటీసి బేబమ్మలు ప్రారంభించారు. తహశీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలాలో పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. వైద్య శిబిరాన్ని నియోజకవర్గ టాస్క్‌పోర్స్ అధికారులు జలవనరుల ఎస్ఈ వెంకటరమణ, డిఎల్‌డిఓ జనార్దన రావులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జెసిఎస్ జిల్లా అధ్యక్షుడు బాబులాల్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఈఓఆర్డి సుదర్శన్ రావు, పంచాయితీ కార్యదర్శి స్వర్ణకుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సిహెచ్ఓ రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు. **బండి ఆత్మకూరు :** మండలంలోని బి.కోడూరు గ్రామంలో సర్పంచ్ వెంకట రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరై ప్రారంభించారు. వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త భువనేశ్వర్ రెడ్డి, డాక్టర్ భావన ఎంపీడీవో వాసుదేవగుప్త, వైసిపి మండల నాయకులు మద్దిలేటి రెడ్డి, నాగేంద్ర, జెసిఎస్ మండల కన్వీనర్ ముడుమేల పుల్లారెడ్డి, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **కొత్తపల్లి :** మండలంలోని శివపురం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ సందర్శించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్ ను పరిశీలించి, ప్రజలకు అంగన్వాడి సెంటర్లలో ఏ విధంగా ఇస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేశారు. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కాంతారావు నాయక్, ఎంపీడీవో మేరీ, ఇన్చార్జి తాసిల్దార్ పెద్దన్న, ఎంఈఓ-2 ఇనాయతుల్ల, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపిటీసీ శివన్న, వైద్యాధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగేశ్వరమ్మ, అంజలి, సర్పంచులు నక్క విజయకుమార్, కలబండి మారెన్న, వైసిపి నాయకులు జిఎండి రఫీ, నారాయణ, శ్రీనివాసులు యాదవ్, జక్కుల రాము, సుబ్బన్న, ప్రసాదు, శివన్న గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. **బేతంచర్ల :** మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి ఎస్తేరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి హాజరై మాట్లాడారు. యాకోబు, నాగేశ్వర్ రెడ్డి నాగరాజు, మురళి, అంగన్వాడి టీచర్లు నాగలక్ష్మి, మహాలక్ష్మి లక్ష్మీదేవి, అంజలి, చంద్రకళ, సరళ, ఆశ వర్కర్లు, మాధవి, లక్ష్మితదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మండలంలోని మిట్టపల్లే గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మాట్లాడారు. **రుద్రవరం :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రజలకు వరం లాంటిదని పుట్లాలమ్మ క్షేత్రం చైర్మన్ ఆళ్లగడ్డ నియోజకవర్గం, వైసీపీ సీనియర్ నాయకుడు గంగుల మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుడిదిన్నె గ్రామంలో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తహాశీల్దార్ రవీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డ్ కమిటీచైర్మన్ గంధం రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న కేశాలు, చిలకలూరి సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, పుల్లాడ్డి కష్టారెడ్డి సుదర్శన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, వైద్యాధికారులు, ఆయా శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** నంద్యాల మండలం అయ్యాలూరులోని గ్రామ సర్పంచ్ ఓబులేసు ఆధ్వర్యంలో సచివాలయం-2లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపిడిఒ సుగుణ శ్రీ, ఇఒఆర్‌డి మహీధర్ రెడ్డిలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకట రమణ పాల్గొని వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు అష్రఫ్ వలి, ఉదయసంధ్య, ముకేశ్, సుధా ప్రియా, సిహెచ్‌ఒలు, ఎఎన్ఎంలు, వైసీపీ లీడర్ బసవేశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **అవుకు :** మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వైద్యులు వినోద్ కుమార్, వైద్యులు శ్రీలక్ష్మి, జయేంద్ర, యమునా, శ్రీలక్ష్మి, సర్జన్ రాజేష్, సూపర్వైజర్లు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాములపాడు : కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బండి ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

నంద్యాల రూరల్ : పరిశీలిస్తున్న డిఎంహెచ్ఎఒ వెంకటరమణ

కేంద్ర పథకాల పనులు పూర్తి చేయండి

- నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మనంద రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ పోచా బ్రహ్మానంద రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో దిశ కమిటీ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. సమావశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ మాట్లాడుతూ 25 శాఖలకు సంబంధించి 43 సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కృష్ణా జిల్లా నుండి రైతు రథం వాహనాన్ని తెప్పించేందుకు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ బుగ్గ నుండి, కైపా నుండి గిద్దలూరు వెళ్లే రహదారి పనులకు టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం క్రింద జెఎస్వై పథకం ద్వారా గర్భవతిగా వున్న ప్రతి మహిళకు ఆర్థిక సహాయం అందాలన్నారు. జిల్లాలో ఇంకా ఆరు శాతం పెండింగ్ ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే పూర్తి చేయాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఐ ప్యాక్ కింద ప్రతిపాదనలు పంపిన రోడ్ల వివరాలు తెలపాల్సిందిగా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈకి సూచించారు. ఓర్వకల్లు, తమ్మరాజు పల్లె మీదుగా వాటర్ పైప్లైన్లు వెళ్తున్నాయని, నీటి సరఫరా చేసిన కు చర్యలు తీసుకోవాలన్నారు. గడివేముల మండలంలో సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారని చర్యలు తీసుకోవాలని హౌసింగ్ శాఖ పిడిని సూచించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాఠశాలలకు నైట్ వాచ్మెన్ సిబ్బంది కొరత ఉందని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓకు సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'సంసాద్' పనులు పూర్తి చేయండి : ఎంపీ పోచా

సంసాద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన నంద్యాల మండలంలోని చాబోలు, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల, ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు, గోవింద పల్లె, కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు గ్రామాల్లో మంజూరైన పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మనంద రెడ్డి ఇన్‌ఛార్జి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సంసాద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - చాగలమర్రి : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డి.వనిపెంట సెక్షన్ అధికారి పెద్దన్న తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్, రుద్రవరం రేంజర్ శ్రీప్రతి నాయుడు ఆదేశాల మేరకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిలోనికి అక్రమంగా ప్రవేశించి అడవి జంతువులను వేటాడినా, చంపిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఎఫ్‌బీఓలు మదన్, నాగేష్, సుభాష్, ప్రొటెక్షన్ వాచర్లు నరసింహ, రాముడు, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని బండి ఆత్మకూరు రేంజ్ ఆఫీసర్ నాసిర్ జా తెలిపారు. వారోత్సవాల సందర్భంగా జ్యోతి హైస్కూల్ విద్యార్థులకు, కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు వణ్యప్రాణుల సంరక్షణ, అడవిలో అంతరించిపోతున్న చెట్ల రకాలపై అవగాహన కల్పించేందుకు వారికి గ్రూప్ డిస్కస్ సెమినార్ అండ్ ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ రవీంద్రనాయక్ మాట్లాడారు. పారిశ్రాకర్స్ ఇబ్బంది, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు : మాట్లాడుతున్న రేంజ్ ఆఫీసర్

జగనన్న కాలనీని పరిశీలిస్తున్న నాయకులు అంబటి గురివి రెడ్డి

వైసిపి పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైసిపి ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వైసిపి కొలిమిగుండ్ల మండల అధ్యక్షుడు అంబటి గురివిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సహకారంతో కాలనీని ఏర్పాటు చేశామని, వారి సహకారంతోనే అభివద్ధి చెందుతున్నాయని తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో చింతలాయపల్లె గ్రామానికి చెందిన 230 మందికి ఇంటి స్థలాలు మంజూరయ్యాయని, అందులో భాగంగా కాలనీ లేఔట్‌లో ఇంటి స్థలాలు పొందిన వారు గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. కాలనీలో ఇప్పటికే గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణాల లబ్ధిదారులకు రోడ్డు సౌకర్యంతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలో వాటికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. నీటి సౌకర్యం కోసం ఇప్పటికే ఒక బోరు ఏర్పాటు చేశామన్నారు. ఒహెచ్ఆర్ ట్యాంకు రూ. 26 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు జరుగుతాయన్నారు.

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివకృష్ణ యాదవ్

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని ఫత్తేనగరం గ్రామానికి చెందిన ఏ.శివకష్ణ యాదవ్‌ను బిజెపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. బిజెపి కోసం నిరంతరం పని చేస్తున్న శివకృష్ణ యాదవ్‌ను గుర్తించి పార్టీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

ఐఎంఎ సీనియర్ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని శిల్పా నేచర్ వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ ఐఎంఏ సీనియర్ సభ్యులైన డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ శీలం నర్సింహారెడ్డిలను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎంఏ కార్యవర్గ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, సభ్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, విజయ భాస్కర్, అనిల్ తదితరులు ఐఎంఏ చేస్తున్న సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాంగోపాల్ రెడ్డి, సురేంద్ర నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, మహిళా వైద్యులు వసంత, సుజాత, సుధ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎ సీనియర్ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో రూ.17.50 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామానికి రూ. 32 లక్షలతో నూతన పైపులైన్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో ఎరువుల కొరత ఉందని రైతులు ఎమ్మెల్యేకు తెలపగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వ్యవసాయ సంబంధిత జిల్లా అధికారులకు రేపటిల్లా రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు నిల్వ చేసి రైతులకు అదించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తనిఖీ చేసిన అధికారులు

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో గల ప్రభుత్వ మద్యం దుకాణాన్ని సత్యసాయి జిల్లా ఎక్సైజ్ స్క్వాడ్ అధికారులు బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని వివిధ రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మద్యం కొనుగోలు చేసే వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. దుకాణదారులు సమయ పాలన పాటించాలన్నారు. స్క్వాడ్ ఎస్ఐ నారాయణ, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, కానిస్టేబుళ్ళు అయ్యప్ప, కమాల్, దుకాణ నిర్వాహకులు జయచంద్ర, ప్రతాప్, నరసింహుడు, మహమ్మద్ హుసేన్‌లు పాల్గొన్నారు.

మెనూ చార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ప్రభుత్వ పాఠశాల మెనూ ఛార్జీలను పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వ డైట్ చార్జిలు పెంచాలని, హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పి. ప్రేమ్ ,కే. దినేష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచకపోవడం వల్ల విద్యార్థులకు మెనూలో కోత పెట్టాల్సి వస్తుందని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దుప్పట్లు, టవల్లను మూడేళ్లగా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించి, పెండింగ్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, సాయి, గంగాధర్, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలు మంజూరు

ప్రజాశక్తి - రుద్రవరం : సబ్సిడీతో రుద్రవరం మండలానికి 300 క్వింటాళ్ల శనగ విత్తనాల మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ క్వింటా శనగ విత్తనాల పూర్తి ధర రూ.8100 కాగా 40 శాతం రూ.3240 సబ్సిడీ పోగా రూ.4860 రైతు చెల్లించాల్సిన ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలను ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక ఎంఆర్సి భవనంలో ఎంఇఒ సుభాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు యాజమాన్యం మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫైర్, పోలీస్, గ్రామపంచాయతీ, శానిటరీ తదితర సర్టిఫికెట్లు లేకుండానే పాఠశాల ఏర్పాటుకు పరిమిషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎటువంటి మౌలిక వసతులు లేకుండా ఏర్పాటు చేసిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు షేక్షావలి, నాయకులు జస్వంత్, రవి పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నేషనల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల : రాయలసీమ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నేషనల్ డిగ్రీ కళాశాల జట్టు యూనివర్సిటీ రన్నర్‌గా నిలిచినట్లు నేషనల్ విద్యాసంస్థల అధినేత డా.యస్.ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 30న స్థానిక రామకృష్ణ పిజి కళాశాలలో నిర్వహించిన రాయలసీమ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల టోర్నమెంట్‌లో షటిల్ బ్యాడ్మింటన్‌లో తమ విద్యార్థులు జకీఉల్లా, న్యామతుల్లా, నయీమ్, వెంకట కార్తిక్‌లు యూనివర్సిటీ స్థాయి రన్నర్ ట్రోఫీని సాధించి కళాశాల కీర్తిని ఇనుమడింపజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో వీరు మరిన్ని విజయాలు సాధించాలన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన కళాశాల అధ్యాపకుడు ఎస్.రఫీ అహ్మద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందిస్తాం

ప్రజాశక్తి - బనగానపల్లె : పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందిస్తామని బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారి కామేష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా లో పేర్లు తీసేయాలని అధికార పార్టీ నాయకులు దరఖాస్తులు చేస్తున్నారని, వాటి క్షున్నంగా పరిశీలించాలని టిడిపి నాయకులు ఎన్నికల అధికారి దృష్టికి తెచ్చారు. తాము ఓటర్ల జాబితాలో పేర్లను తొలగించాలని దరఖాస్తులు చేయలేదని, చనిపోయిన వారి ఓటర్లు, డబల్ ఎంట్రీ ఉన్న వారి పేర్లను మాత్రమే తొలగించాలని దరఖాస్తులు చేసినట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పై వివిధ పార్టీల నాయకుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకుంటామని తెలిపారు. 6, 7, 8 వచ్చిన ఫారాలను, అడ్రస్ మార్పులు, చనిపోయిన ఓట్లు, డబుల్ ఎంట్రీ లపై క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు అనిల్, టిడిపి నాయకులు హరి, విష్ణు, బిజెపి నాయకులు యాదగిరి, బిఎస్పి నాయకులు చిన్నయ్య, సిపిఐ నాయకులు కాలింగిరి రాముడు తదితరులు పాల్గొన్నారు

వచ్చే ఎన్నికల్లో వైసిపి పతనం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వచ్చే ఎన్నికల్లో వైసిపికి పతనం తప్పదని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా వాల్మీకి సంఘం నాయకులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. కోయిలకుంట్ల మండల అధ్యక్షులు అమడల మద్దిలేటి, పసుపల బాల నాయుడు, ఒగుటూరు వెంకటసుబ్బయ్య, బుచ్చన్న, కొలిమిగుండ్ల ఎద్దుల వెంకటేశ్వర్లు, వాల్మీకి ప్రసాద్ చెరువు పల్లె మాజీ సర్పంచ్ మదిలేటి, బెలూమ్ హుస్సేనయ్య, లింగాల నాయుడు, సంజమాల మల్కి, వసంతాపురం శేఖర్, మాజీ ఎంపిటిసి సభ్యులు మీరాపురం రామకష్ణుడు, నందివర్గం వెంకటయ్య, యాగంటి పల్లె పైఇంటి చిన్నన్న, బోయ సాదు, కిరణ్, నారాయణ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు సామూహిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులకు పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, టిడిపి బీసీ సెల్ నంద్యాల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్నలు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, తెలుగు యువత నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళేశ్వర రెడ్డి,నాయకులు యాగంటిపల్లె తపాల పెద్ద దస్తగిరి, చిన్నరాజుపాలెం నరసింహులు, రామాంజనేయులు, మంగంపేట శ్రీనివాసులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరులో బాబుకోసం మేము సైతం అంటూ 22వ రోజు చేపట్టిన రిలే దీక్షల్లో పాల్గొన్నారు. సుమారు మూడు వందల మంది టిడిపి, జనసేన, సిపిఐ శ్రేణులు ఈ దీక్షలో కూర్చున్నారు. టిడిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగ రెడ్డి, సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, గోవిందరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, మహానంది మండల అధ్యక్షుడు ఉల్లి మధు, అబ్దుల్లాపురం బాషా, జాకీర్, నందయ్య, హరిప్రసాద్, సిద్దయ్య, సర్పంచ్ రామ చంద్రుడు, సర్పంచ్ సింగారం రామ సుబ్బయ్య, కిలారి వెంకటేశ్వర్లు, రఘుస్వమి రెడ్డి, నరసింహా రెడ్డి, రామనాయుడు, సూర్య నారాయణ రెడ్డి, నాగ శేఖర్, మోమిన్ రసూల్, హిదయత్ అలి ఖాన్, చెన్నా రెడ్డి, అన్వర్ ఖాన్, జన సేన నాయకులు అరుణ్, మురళి, రామయ్య, షాలి బాషా, సిపిఐ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆళ్లగడ్డలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మాజీ మంత్రి స్వగృహం వద్ద రిలే నిరాహార దీక్షలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. రుద్రవరం టిడిపి నాయకులు ఆలమూరు నారాయణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్రైస్తవ ముసుగులో సైతాన్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఈటే స్వామి దాసు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక తప్పుడు కేసుతో ఇరికించారని, అయినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్టీ సెల్ కార్యవర్గ సభ్యుడు రవీంద్రనాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి రూబెన్, ఉమ్మడి కర్నూలు జిల్లాసర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, బేతంచర్ల కౌన్సిలర్ కే రాంగోపాల్, నంద్యాల మధు, సుమంత్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్, అంజి, శ్రీపతి నాగరాజు, క్రిస్టియన్ సెల్ నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి తనంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు మండల లీడర్లు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి సంఘీభావం తెలియజేశారు. టిడిపి అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, జయ సూర్య, ముర్తుజావలి, సర్పంచులు పాల్గొన్నారు.

బనగానపల్లె : దీక్షలు చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఆత్మకూరు : మాట్లాడుతున్న నాయకులు

ఆళ్లగడ్డ : దీక్షలో పాల్గొన్న మాజీ మంత్రి

నందికొట్కూరులో నేతలకు పూలమాలలు వేస్తున్న నాయకులు